సీపీఐ శతజయంతి ఉత్సవాలలో భాగంగా కడప సీపీఐ సీనియర్ నేత చెన్నకేశవరెడ్డిని సీపీఐ అగ్రనేతలు కె.రామకృష్ణ, జి.ఈశ్వరయ్య, చంద్ర ప్రభృతులు ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

# విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఆదివారం 29, డిసెంబరు - 2024 8 పేజీలు


## ఎంపిడిఓపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్

**విశాలాంధ్ర-కడప :** విధి నిర్వహణలో ఉన్న అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో సీఏ జవహర్ బాబుపై దాడి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని.. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పీఆర్అండ్ ఆర్డీ, అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన దాడి ఘటనలో గాయపడి ప్రస్తుతం కడప రిమ్స్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో సీఏ జవహర్ బాబును.. శనివారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత ఎంపిడివో ఆరోగ్య పరిస్థితిని ఉపముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎంపిడివో కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఎంపిడివో సీఏ జవహర్ బాబుపై జరిగిన దాడిని అప్రజాస్వామిక చర్యగా పరిగణిస్తున్నామని, ఎన్డీయే ప్రభుత్వంలో ఇటువంటి దౌర్జన్యాలకు, రౌడీ చర్యలకు తావువ్వబోమన్నారు. బాధిత ఎంపీడీవోకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ వైద్యాధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. దాడి ఘటనలకు సంబంధించి.. నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లాల పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఎస్సి, ఎస్టీ కులాలకు సంబంధించిన అధికారుల పై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎంపిడివో పై దాడి హేయనీయమైన చర్య అని పేర్కొన్నారు. ఎంపిడీవో కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రిటైర్డ్ అయినా కూడా వదిలిపెట్టమని ఎంపిడివో కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇలాంటి ఘటనలను సహించేది లేదన్నారు. పోలీసులే కాదు జనం కూడా ఇలాంటి దాడులపై వాటిపై స్పందించాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఇప్పటికే జిల్లా

2

## ఎరుపెక్కిన కడప

### కదం తొక్కుతూ.. పదం పాడుతూ

నేటి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం తప్పదు

శతవార్షికోత్సవంలో కె.రామకృష్ణ, జి.ఈశ్వరయ్య ఉద్ఘాటన

**విశాలాంధ్ర-కడప బ్యూరో:** నేటి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిరక్షణకు ఎదురొడ్డి పోరాడి ప్రాణత్యాగాలు చేసిన కమ్యునిస్టు కామ్రేడ్లను ఆదర్శంగా తీసుకొని మరిన్ని పోరాటాల బాటలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత కమ్యునిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. నేటి పాలకులకు కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్ర ఆదర్శంగా నిలవాలని సూచించారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలను కడప నగరంలో పెద్దఎత్తున నిర్వహిం చారు. ముందుగా నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుండి సాయిబాబా థియేటర్, ఎన్టీఆర్ మార్గ్, సెవెన్రోన్స్ వరకు కామ్రేడ్ల పదాధిదళాలతో పెద్దఎత్తున నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడురోడ్ల దగ్గర నిర్వహించిన బహిరంగ సభను నిర్వహించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ యూరోపియన్ దేశాలలో రష్యా బోర్సివిక్ విప్లవాలను ఆదర్శంగా తీసుకొని వంద సంవత్సరాల క్రితం భారతదేశంలో కమ్యునిస్టు పార్టీ పురుడుపోసుకుందన్నారు. పోరాటాల నేపథ్యంలో అనేక కుట్రలు కుతంత్రాలకు బలై అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజల మానప్రాణ ఆస్తి రక్షణ కొరకు కమ్యునిస్టు పార్టీ నిలబడిన విధంగా దేశంలో ఏ పార్టీ కూడా కమ్యునిస్టు పార్టీ దరిదాపుల్లోకి చేరలేకపోయాయని గొంతెత్తి చెబుతున్న గొప్ప విజయం కమ్యునిస్టులదేవన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారి పాలనలో ప్రాణాలను పణంగా పెట్టి ఎదురొడ్డి నిలబడిన కమ్యునిస్టు పార్టీ పంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషాన్నికలిగించిందన్నారు. అలాంటి పార్టీ వందేళ్ల బహిరంగ సభలో పాల్గొనడం మహానందంగా ఉండన్నారు. పని విధానంలో 10గంటలు మాత్రమే సాధించడం, వ్యవసాయ కార్మిక విద్యార్థుల సమస్యలపై పోరాటాలపైనే కాకుండా యువజన సంఘాలు ప్రజా నాట్య మండలి వంటి సంఘాలను ఏకీకృతం చేసి కమ్యునిస్టు కాగడాలతో ఉ ద్యమబాట పట్టి దేశంలో కోట్లమంది ఆదరాభిమానాలను చూరగొన్నది. ఒక్క కమ్యునిస్టులేనన్నారు. భూ సంస్కరణల చట్టం బ్యాంకుల జాతీయాకరణ, ఉ సాధి హామీ వంటి ఎన్నో చట్టాలను అలుపెరుగని పోరాటం చేసి సాధించింది కమ్యునిస్టులేనన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 సంవత్సరాలు అవుతున్నా పట్టుమని లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ దేశ సంపదను ప్రస్తుత పాలకులు కార్పొరేట్ సంస్థ చేతుల్లో పెడుతున్నాయని ప్రశ్నించే గొంతులను ఉక్కుపాదంతో నొక్కి వేస్తున్నారని ఇందుకు నిదర్శనమే గౌరీ లంకేష్, కల్బుర్గి, సాయిబాబా వంటి వీరుల గొంతుల నొక్కారన్నారు. జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ ఫ్యాక్టరీతో పాటు సాగు, తాగునీరు నిరుద్యోగ సమస్య రైతు సమస్యల పైన గూడు లేని వారికి గూడు కల్పించడం కోసం జనవరి 2వ తేదీ నుంచి

2

## బద్వేల్‌లో కొత్త పుంతలు తొక్కుతున్న వైద్య వ్యాపారం.!

**విశాలాంధ్ర - బద్వేలు :** వైద్యో నారాయణ హరి అంటూ వైద్య వృత్తిలో కొనసాగే డాక్టర్లను నారాయణ స్వరూపంగా భావిస్తుంది సమాజం. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణం పోసి పునర్జన్మను ఇవ్వగలిగే సత్తా ఉన్న వైద్యవృత్తికి నేటికీ సమాజంలో అపార గౌరవం ఉంది. సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన ఎందరో వైద్యులను నేటికీ స్మరించుకుంటూ ఉంటారు. సమాజంలో తమకిస్తున్న గౌరవ మర్యాదలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా ఎంతో హుందాగా సేవా దృక్పథంతో పనిచేసే వైద్యుల సంఖ్య సమాజంలో తగ్గిపోతుంది. వైద్యం వ్యాపారమైన వేళ విలువలు అనే వలువలు గాలికి కొట్టుకుపోయాయి. ధనార్జనే ధ్యేయంగా రోగులను పిల్చి పిప్పి చేసి ఠాగూర్ సినిమాకు తాము ఏ మాత్రం తీసిపోమని నిరూపించుకుంటున్నారు. రోగి ఎంత భయపడితే అంతస్థాయిలో తమ జేబులు నింపుకోవచ్చని సూత్రాన్ని వంట పట్టించుకున్న కొంతమంది వైద్యులు రోగికి ఉన్న నిజమైన ఆరోగ్య స్థితిని దాసి అర్థం కాని జబ్బుల పేర్లు చెప్పి రోగిని రోగి బంధువులను సైతం సందిగ్ధంలో పడేస్తున్నారు. జ్వరమని హాస్పిటల్‌కి వెళితే రక్త కణాలు తగ్గాయని బెదిరించి వేలల్లో లక్షల్లో డబ్బులు వసూలు చేయడం సర్వసాధారణంగా మారిందని బద్వేల్ పరిసర ప్రజలు వాపోతున్నారు. గ్యాస్ ట్రబుల్ తో బాధపడే రోగికి అవగాహన లోపంతో ఈసీజీలు తీసి గుండెపోటు వస్తుందని బెదిరించి మరీ డాక్టర్లు ఆస్పత్రిలో ఉండాలని లేదంటే మేము ప్రతిపాదించిన ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు. కార్పొరేట్ వైద్యం అందిస్తామని ముసుగులో కాసులు పోగు చేసుకోవటమే కాకుండా బంధువులకు బ్రతికి ఉండగానే నరకం చూపిస్తున్నారు.

అక్కరలేని వైద్య పరీక్షలు అనవసరమైన మందులు టానికులు అంగడి దినుసుల పట్టేని మరిపిస్తూ ప్రిస్క్రిప్షన్ రాసి మెడికల్ షాపుల వారి వద్ద కమిషనర్ల దండుకుంటున్నారని అంటున్నారు. చెప్పాలంటే హాస్పటల్ నిర్వహణ డాక్టర్ల జీతం తదితర ఖర్చులన్నీ మందుల షాపు వారే భరిస్తున్నారు అన్నది బహిరంగ సత్యమే మరి కొంతమంది డాక్టర్లు రోగం యొక్క తీవ్రతను పెంచి రోగిని ఆందోళన గురిచేసి నగరాలలో ఉన్న తాము సూచించిన వైద్యుల వద్దకు వెళ్లాలని సిఫారసు చేస్తున్నారు. అయితే పట్టణాలలో సంబంధిత కార్పొరేట్ వైద్యశాలలు ఆర్ఎంపి నుండి ఎంబిబిఎస్ డాక్టర్ల వరకు కమిషన్లు చెల్లిస్తారు అన్నది జగమెరిగిన సత్యమే. ఇటీవల మూడు సంవత్సరాల క్రితం స్థానికంగా ఉన్న సిద్దవాటం రోడ్డులో ఏర్పాటు చేసిన ఒక వైద్యశాల ఈ తరహా వైద్య వ్యాపారానికి పాల్పడుతుందని ప్రజలు లబోదిబో అంటున్నారు. చిన్న పిల్లలకు సైతం

2

## కాన్పుకొచ్చి ... కానరాని లోకాలకు...

వైద్యం వికటించి బాలింత సుమతి మృతి

వైద్యులు నిర్లక్ష్యమే కారణం మృతురాలు కుటుంబ సభ్యులు.

ఫిట్స్ కారణం అంటున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా

**విశాలాంధ్ర - జమ్మలమడుగు :** పురికి నొప్పులతో కాన్పుకు వచ్చిన మహిళ... కానరాని లోకాలకు వెళ్లడంతో జమ్మల మడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కసారిగా విషాదఛాయలు కమ్ముకున్నాయి. మృతురాలు బంధువులు రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం అంతా విషాదఛాయలు అలుము కున్నాయి. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం గ్రామా నికి చెందిన సుమతి (26) శుక్రవారం రెండవ కాన్పు కోసం జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవం కోసం చేరింది. వైద్యులు సలహా మేరకు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అన్ని పరీక్షలు నిర్వహించారు. శనివారం ఉదయం సుమతికి సిజరిన్ ఆపరేషన్ నిర్వహించగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. జన్మనిచ్చిన కొన్ని కొన్ని గంటలలోపే సుమతి మృతి చెందిందని మృతురాలు బంధువులు తెలిపారు. బాలింత సుమతి వైద్యం వికటించి మృతి చెందిందని భర్త తిరుమలయ్య ఆరోపిస్తున్నారు. వైద్యులు తన భార్యకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తిరుమలయ్య తెలిపారు. మృతురాలు నోటి వెంట బూరుగు రావడంతో ఈ ఘటన జరిగిందని ఆయన తెలిపారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే సుమతి మృతి చెందడంతో సమాచారం అందవేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిట్స్ కారణంగా సుమతి మృతి చెందిందని తెలిపారు. ఈ ఘటనలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.

# వైద్య వ్యాపారం.!

(మొదటి పేజీ తరువాయి)

ఈ తరహా వైద్యం అందిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. రూము చార్జీల నిర్వహణ మందుల ఖర్చు వైద్య పరీక్షల ఖర్చు వంటి తదితర ఖర్చులతో రోగికి బతికుండగానే ఆర్థిక నరకాన్ని చూపిస్తున్నారు. వైద్యాధికారులు తనిఖీలు చేసిన సామాజికంగా ఆర్థికంగా తనకు ఉన్న పలుకుబడి డబ్బులు వినియోగించి తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి ఈ తరహా వైద్యంపై తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి వైద్య వ్యాపారానికి అడ్డుకట్ట వేయవాలని బద్వేల్ పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ఎంపిడిఓపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీకి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎంపిడివో పై దాడి చేసిన ఒక న్యాయవాది అని, చట్టాలు తమకు తెలుసని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. సింహాద్రిపురంలో రైతు కుటుంబం ఆత్మహత్య పై సమగ్ర సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ను ఆదేశించామని, రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు డా.శ్రీధర్ చెరుకూరి, చామకూరి శ్రీధర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎస్పీ విద్యాసాగర్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జెడ్పి సీఈవో ఓబులమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.జి.వి.రమాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ,సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు ,రిమ్స్ డాక్టర్లు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్ రోబోటిక్ రీప్లేస్మెంట్ సర్జరీలు :డాక్టర్ జహంగీర్ భాష

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రోబోటికి కీళ్ల మార్పిడి సదస్సు అయినటువంటి రోబో కాన్ 2.0, హైదరాబాద్ జరిగిందని, తన అనుభవాన్ని అందులో పంచుకోవాలని ఆహ్వానం అందడం ద్వారా నేను ఈ సదస్సులో పాల్గొనడం జరిగిందనీ . డాక్టర్ జహంగీర్ భాష ఈ మేరకు శనివారం జేబీ హాస్పిటల్ నందు విలేకరుల సమావేశం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి గౌరవం దొరకడం రాయలసీమలోనే చాలా అరుదని వివరించారు. దేశం నలుమూల నుంచి రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్స్ అందులో పాల్గొని తమ అనుభవాన్ని పంచుకోవడం జరిగినది వివరించారు. భవిష్యత్తులో కీల మార్పిడిలు రోబోటిక్ అసిస్టెంట్ పద్ధతిలో జరుగుతున్నాయని ఆయన వివరించారు. జేబీ హాస్పిటల్ లో ఉన్నటువంటి వెల్సెస్ రోబో చాలా అత్యాధుని కమైనదని (ఫిఫ్త్ జనరేషన్), లేటెస్ట్ రోబో కావడంతో ఇంతకు మునుపు ఇతర రోబోలలో ఉన్న సమస్యలు ఇందులో లేవని తెలిపారు. ప్రస్తుతం ఆపరేషన్ అతి తక్కువ సమయంలో, కచ్చితత్వంతో,అతి తక్కువ రక్తస్రావము మరియు ఇన్ఫెక్షన్ లేకుండా జరుగునని తెలిపారు. ఇప్పటికే తను రోబోటి టెక్నిక్ ద్వారా అతి కష్టమైన కీళ్ళ మార్పిళ్ళు 100కు పైగా చేశానని ఈ సదస్సులో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం జి బి హాస్పిటల్ సీఈవో డాక్టర్ జయ భారతి మాట్లాడుతూ. డాక్టర్ జహంగీర్ భాష ఈ సదస్సులో తన అనుభవాన్ని అందరికీ పంచి ప్రశంసలకు పొందారని, ఇది తమకెంతో ప్రత్యేకమని తెలిపారు. రాయలసీమ ప్రజలు ఇప్పుడు రోబోట్ కీళ్ళ మార్పిడి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్ళవలసిన అవసరం లేదని జేబీ హాస్పిటల్లో అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## బ్రహ్మంగారి మఠం అభివృద్ధి పర్యా టకంశాఖ కల్పించాలని డిప్యూటీ సీఎంకు వినతి

విశాలాంధ్ర- బ్రహ్మంగారి మఠం : మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆలయాన్ని అభివృద్ధికి దిష్టిపెట్టాలని భూతభవిష్యత్తు వర్తకాలని జరిగేది జరగబోయేది భక్తులకు తెలియజేసిన బ్రహ్మంగారి స్వాములవారి మఠం దక్షిణ భారతదేశం చాలా ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రం బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ ను, పర్యా టకంశాఖ కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కు మైదుకూరు నియోజకవర్గ జనసేన పార్టీకి చెందిన గోశెట్టి చియింగారి కృష్ణమూర్తి ఉప ముఖ్యమంత్రికి విన్నత్పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గం లోనే ఉన్న బ్రహ్మంగారి మఠం కాలజ్ఞా కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి బూతభవిష్యత్తు వర్తకాలాన్ని జరిగేది జరగబోయేది భక్తులకు వివరించిన కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం అభివృద్ధి భక్తులు వివిధ రాష్ట్రాల నల్ల మూలల నుండి వచ్చే భక్తులకు బ్రహ్మ సాగర్ ను పర్యాటాక శాఖ ప్రకటించాలని జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ ప్రజలు ఉమ్మడి జిల్లా కడప జిల్లా ప్రజలు వివిధ రాష్ట్ర ప్రజలు అందరూ కోరుకుంటున్నారని ఈ విషయం లెటర్ పూర్వకంగా ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

# ఎరుపెక్కిన కడప

(మొదటి పేజీ తరువాయి)

10వరకు ఉద్యమబాటలోనే ఉంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, ఎల్. నాగసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, వీరశేఖర్, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, విజయలక్ష్మీ, వేణుగోపాల్, కేసీబాదుల్లా, ఎన్. వెంకటశివ, శ్రీరాములు, గంగాపురేష్, ప్రజానాట్యమండలి నాయకులు కొత్తపట్నం రామకృష్ణ గురప్ప, శ్రీనివాసవర్మ, రమేష్ జిల్లా సమితి సభ్యులు మనోహర్రెడ్డి, మద్దిలేటి, మల్లికార్జున, భాగ్యలక్ష్మీ, మస్తాన్, బాల ఓబయ్య, శివరాం, నాగేశ్వరరావు, శంకరానాయక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు..

# డిసెంబర్ 31నే పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర -అట్లూరు:మండల పరిధిలోని12 గ్రామ పంచాయతీ ల పరిధిలో డిసెంబర్ 31వ తేదీనే పింఛన్లపంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు మండల అభివృద్ధి అధికారి భాస్కర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటో తేదీ కాకుండా 31వ తేదీనే పింఛన్ల పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. కావున పింఛన్దారులందరూ 31వ తేదీ ఇంటి దగ్గర ఉండి పింఛన్ సొమ్ము తీసుకోవాలని తెలిపారు. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ( పిఎ సిఎస్) సభ్యత్వం కలిగిన రైతులకు సచివాలయ ఉద్యోగులు కేవైసీ చేయడం జరుగుతుంది. రైతులు వారికి సహకరించాలని మండల పరిధిలో 1849 మంది రైతులుఈ కేవైసీ చేయించుకోవాలని భాస్కర్ బాబుకోరారు.

## చిరకాలమిత్రుడు శర్మకు సన్మానం: రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : పరిధిలోని మండలం, భాకరాపేట గృహ ప్రవేశం వేడుకల్లో రెడ్యం వెంకట సుబ్బారెడ్డి గ్రామానికి చెందిన రాయిపెద్ది సుబ్బరామ శర్మ - సువర్చల దంపతుల నూతన గృహప్రవేశం సత్యనారాయణస్వామి వ్రతం శనివారం జరిగింది.గృహప్రవేశ వేడుకల్లో వైఎస్సార్ సిపీ నేత, ఏపీయస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి హజరై రాయిపెద్ది దంపతులు అత్యున్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ నా చిరకాల మిత్రుడు కలుసుకోవడం ఆయనను సుబ్బరామ శర్మను ఘనంగా సన్మానించిన సంతోష్కారం ఉందన్నారు.

## జగన్ అవినీతి వల్లె విద్యుత్ భారాలు రూ 1,29,000 కోట్లు : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి : 2014 నుంచి 2019 వరకు కూడా తెలుగుదేశం ప్రభుత్వం ఒక్క రూపాయి కరెంట్ చార్జీలు పెంచలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకూ విద్యుత్ చార్జీలను పెంచనేలేదని, జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన చేసిన పాపాల కారణంగా విద్యుత్ చార్జీలు పెరిగాయని, జగన్ అవినీతి వల్లె విద్యుత్ భారాలు రూ.1,29,000 కోట్లు చేరాయని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉన్న రాష్ట్రాన్ని 2019 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్ది వైసీపీ ప్రభుత్వానికి నాటి టీడీపీ ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కానీ 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న ప్రజలపై రూ.35 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడమే కాకుండా రూ.1.20 లక్షల కోట్ల నష్టాన్ని విద్యుత్ శాఖలో తెచ్చిపెట్టారన్నారు. గుట్టుచప్పుడు కాకుండా డిస్కంల ద్వారా ప్రజలపై భారం వేయండని ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపారన్నారు. సాధారణంగా ఈఆర్సీకి పంపిన 90 రోజుల్లోపు ట్రూప్ అప్ చార్జీలు ఆమోదం పొందాలని...కానీ 2024 మే వరకు కూడా ట్రూప్ అప్ చార్జీలను వాయిదా వేస్తూ వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈఆర్సీ నుంచి ఆమోదం పొందిన ట్రూప్ అప్ చార్జీలు నేడు ప్రజలపై భారంగా పడుతున్నాయని వివరించారు. ప్రతీ ఏటా విద్యుత్ వినియోగం సగటున 6 శాతం పెరుగుతుందని, పెరుగుతున్న డిమాండ్ కు తగ్గట్లు ఉత్పత్తిని కూడా పెంచాల్సి ఉంటుందని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వీటీపీఎస్, కృష్ణపట్నం జెన్కో ప్లాంట్ల సామర్థ్యాన్ని విస్తరించామన్నారు. కానీ జగన్ మోహన్ రెడ్డి వాటిని పూర్తి చేయలేకపోయారన్నారు. అంతేకాకుండా జగన్ రెడ్డి చేసిన పెద్ద పొరపాటు పీపీఏలను రద్దు చేయడమని, పీపీఏల రద్దు కారణంగా 8 వేల మెగావాట్ల వరకు విద్యుత్ను ఏపీ కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఆ 8 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ను సీఎం చంద్రబాబు తిరిగి అందుబాటులోకి తీసుకుని వచ్చారన్నారు. కేవలం సీఎం చంద్రబాబుకు పేరు వస్తుందన్న అక్కసుతోనే జగన్ రెడ్డి నాడు పీపీఏలను రద్దు చేశారన్నారు. పీపీఏలను రద్దు చేయడం కారణంగా విదేశీ బ్యాంకర్లు, పెట్టుబడిదారులు కేంద్రానికి ఫిర్యాదు చేశారని, ఈ కారణంగా విద్యుత్ వినియోగించుకోకపోయినా డబ్బు చెల్లించాల్సి వచ్చిందన్నారు. మరోవైపు జగన్ తన కమీషన్ల కక్కుర్తి కోసం ఎక్కువ రేటు కు విద్యుత్ కొనుగోలు చేశారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో కనీసం ఒక్క మెగావాట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదన్నారు. రాష్ట్రానికి జగన్ చేసినంత నష్టాన్ని ఏ రాజకీయ నాయకుడూ చేయలేదని దుమ్మెత్తి పోశారు. విద్యుత్ వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్ కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీలపై జగన్ మోహన్ రెడ్డి ధర్నాలకు పిలుపునివ్వడం మరో తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నాలకు పిలుపునిచ్చారని ఎద్దేవా చేశారు. కృష్ణపట్నం విద్యుత్ ప్లాంట్కు నాసిరకం బొగ్గును సరఫరా చేశారని, నాలుగు లక్షల టన్నులు కృష్ణపట్నం ప్లాంట్ కోసం కొనుగోలు చేస్తే.. దానిలో లక్ష టన్నులు నాసిరకం కొనుగోలు చేశారని ఆరోపించారు. నాసిరకం విద్యుత్ కొనుగోళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందుకు సంబంధించిన వారిపై విచారణకు ఆదేశిస్తామని తేల్చి చెప్పారు. విద్యుత్ శాఖకు అందించిన సేవలకు సన్మానం చేయాలని జగన్ అంటున్నారని, ప్రజలు ఇప్పటికే 11 సీట్లు ఇచ్చి జగన్ను ఘనంగా సన్మానించారన్నారు. జగన్ మోహన్ రెడ్డిపై కార్యకర్తలే తిరగబడే పరిస్థితిని తెచ్చుకున్నారన్నారు. కాంట్రాక్టు పనులు చేయించి బిల్లులు ఎగ్గొట్టారన్నారు. విద్యుత్ వ్యవస్థకు రూ.1.29 లక్షల కోట్లు మేర అప్పులు చేశారని విమర్శించారు. జగన్ తప్పులతో నాశనమైన విద్యుత్ వ్యవస్థను చంద్రబాబు సరిదిద్దుతున్నారన్నారు. ప్రజల్లో ఉనికి కోల్పోయిన వైసీపీ ధర్నాలు చేస్తోందని, వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మరన్నారు. ధర్నాల్లో పాల్గొనాలని జగన్ ఇచ్చిన పిలుపునకు ప్రజల్లోనే కాకుండా, సొంత పార్టీలో కూడా స్పందన లేదన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు ప్రత్యేక రాజ్యాంగం ఉందా..?

### సమయపాలన పాటించకపోవడంలో అంతర్యమేమిటి

### సమావేశాన్ని బహిష్కరించిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

**విశాలాంధ్ర-పులివెందుల:** పులివెందులలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు ఏదైనా ప్రత్యేక రాజ్యాంగం ఉందా అంటూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. మున్సిపల్ పాలక వర్గం, అధికార వర్గం సమయపాలన పాటించకపోవడంలో అంతర్యమేమిటని మరోమారు ఆయన ప్రశ్నించారు. దీంతో విసుగు చెందిన ఆయన సమావేశాన్ని బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట కాసేపు బైటాయించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్దతి ఏదైనా సమావేశాలు నిర్వహిస్తే అందుకు అందరూ సమయపాలన పాటించాల్సి ఉందన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ ఏర్పాటు చేయనుండటంతో ప్రొటోకాల్ ప్రకారం తనను కూడా ఆహ్వానించారన్నారు. అయితే 10.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తాను ఐదు నిముషాలు అంటే 10.25గలటకు కార్యాలయం చేరుకున్నానన్నారు. ఇది వరకు కూడా ఏవేవో కుంటిసాకులు చెబుతూ మూడు దఫాలుగా కౌన్సిల్ సమావేశం నిర్ణయిత సమయానికి జరుపలేదన్నారు. ఒకవేళ ఏదైనా కోరంలేని పక్షంలో అధికారులు సమావేశం వాయిదా వేస్తారన్నారు. కానీ ఇక్కడ పాలక వర్గం ఉన్నా అధికారులు సమావేశం ఎందుకు నిర్వహించలేదో అర్థంకావడంలేదన్నారు. నాల్గోసారి కూడా మునుపటి వలే సమావేశం జరిగితే ఇక ఫలితం ఏముందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఇందుకు ఇక్కడ బిన్నంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశానికి సమయం కావస్తున్నా పాలకవర్గం, అధికారులు బయటనే ఉన్నారుకానీ సమావేశ మందిరంలోకి రాకపోవడాన్ని తాము నిరసిస్తున్నామని అందుకు బహిష్కరించినట్లు ఆయన ప్రకటించారు.

## ప్రజల భూములకు రక్షణ కల్పించాలి

**విశాలాంధ్ర - రైల్వేకోడూరు :** నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలంలోని గాదెల గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజల భూములకు రక్షణ కల్పించాలని బిజెపి నాయకులు చిన్నరెడ్డి గోవర్ధన్ రెడ్డి రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయి వివరించారు. శనివారం గాదెల గ్రామపంచాయితీ పరిధిలోని సచివాలయం వద్ద జరిగిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోవర్దన్ రెడ్డి స్థానిక ప్రజలకు అండగా నిలబడి రెవిన్యూ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.భూములకు రక్షణ కల్పించక పోతే కూటమి అద్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అధికారులను హెచ్చరించారు.బిజెపి ఓబుల వారిపల్లి మండల అధ్యక్షులు చిన్నరెడ్డి రాజగోపాల్ రెడ్డి,కూటమి నాయకులు వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎంపీడీవో పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**విశాలాంధ్ర-రాయచోటి:** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై అతని కార్యాలయంలో తాళాలు వేసి భౌతికంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీజిఇఏ జిల్లా అధ్యక్షులు వై.శ్రీనివాసులు రెడ్డి, కోశాధికారి యం.సుధాకర్ రాజు, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఓ. సాయికుమార్, కార్యదర్శి డి.సుజిత్ కోరారు. రాయచోటి పట్టణం ఏపీజిఇ శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉంటే ప్రభుత్వ అధికారులతో సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. అంతేగాని ఇలా ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో ఉండగా ప్రభుత్వ కార్యాలయంలో చొరబడి తాళాలు వేసి దాడులకు పాల్పడడం అమానుషం ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అధికారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## టిడిపి నేతల దౌర్జన్యంతో నష్టపోయిన కుటుంబానికి వైఎస్ఆర్ అండ

**విశాలాంధ్ర - బద్వేలు :** బద్వేలు నియోజకవర్గంలోని బికోడూరు మండలం తంగేడుపల్లెలో రెండు నెలల క్రితం టిడిపి నేతల దౌర్జన్యంలో సర్వం కోల్పోయిన బిసి వర్గానికి చెందిన వైసిపి నాయకుడికి పార్టీ అండగా నిలిచింది. వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఎంపీ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు బద్వేల్ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరైన వెంకట సుబ్బయ్యకు జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ చేతుల మీదుగా రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాయుడు ఆయన కుమారుడైన వెంకటసుబ్బయ్య, వెంకట రమణ, సుబ్రహ్మణ్యంలు కొన్నేళ్లుగా వైఎస్ఆర్సిపి సానుభూతి పరులుగా వ్యవహరిస్తున్నారన్న కారణంతో గ్రామానికి చెందిన టిడిపి నేతలు సుబ్బరాయుడుపై కక్ష పెంచుకు న్నారని తెలిపారు. వారికి చెందిన సుమారుగా 5 ఎకరాల పొలంలోని నిమ్మ జామ చెట్లు, పొలం చుట్టి వేసు కున్న కొంచె, పొలంలో నిర్మించుకున్న ఇంటిని సైతం అర్ధరాత్రి సమయంలో వచ్చి ధ్వంసం చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ సానుభూతిపరులపై దౌర్జన్యాలతో పాటు అక్రమ కేసులు బనాయిస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దేవసాని ఆదిత్య రెడ్డి, నియోజకవర్గం బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణా రెడ్డి, మాజీ సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల నాయకులు యోగానంద రెడ్డి, సింగల్ విండో చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, గాజులపల్లి హరికృష్ణ రెడ్డి సిద్దువెంకటసుబ్బారెడ్డి నాగం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా రంగం కాపాడుకొందాం

**విశాలాంధ్ర-రాయచోటి:** ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకొనుటకు యుటిఎఫ్ నిరంతరం పోరాడుతోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు తెలిపారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 26 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార యాత్రలు జరుగుతున్న సందర్బంగా శనివారం జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రచార యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ జాత రాయచోటి నుండి బయలుదేరి గుర్రంకొండ, అంగళ్ళు, మదనపల్లి, వాయల్పాడు, పీలేరు వరకు కొనసాగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5,6,7,8 తేదీల్లో స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులంతా ఈ సభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబిర్ మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో ఉపాధ్యాయుల సమస్యల సాధన కొరకు తీర్మానలు ప్రవేశ పెట్టి విస్తృతంగా చర్చలు జరిపి వాటి సాధన కొరకు ప్రణాళిక రూపొందిచడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ మహా సభలలో జనవరి 5న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, సహాధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగలరాజు, శివారెడ్డి, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సురేంద్ర రెడ్డి, ప్రచురణాల విభాగం కన్వీనర్ విజయ్ కుమార్, మునిసిపల్ కమిటీ కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రహిమాన్, ఆడిట్ కమిటీ సభ్యులు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దళిత వ్యక్తి పై దాడి చేయడం పిరికిపంద చర్య : ఎంపీపీ ఆగ్రహం

**విశాలాంధ్ర-సిద్దవటం :** దళిత వ్యక్తి గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు పై వైయస్సార్ పార్టీ గూండాలు ఒక దళిత వ్యక్తి అయిన అధికారిపై దాడి చేయడం పిరికిపంద చర్య అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ శనివారం తమ స్వగృహంలో మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ చెందిన వ్యక్తులు ఎంపీడీవో దళిత వ్యక్తి జవహర్ బాబు పై దాడి చేయడం నీచమైన చర్య అని గతంలో సిద్ధవటం ఎంపీడీవో గా విధులు నిర్వహించి ప్రజలకు ఎన్నో సేవలు అందించిన అటువంటి అధికారి పై గుండాగిరి చేసి దాడులు చేయడం సబబు కాదని వెంటనే దాడి చేసిన వారికి కఠినంగా శిక్షించాలని ఆమె అన్నార.ు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులపై ఎవరైనా కూడా దాడులు చేస్తే చర్యలు తప్పవని అన్నారు.

## వాస్తవాలకు ప్రతిరూపం విశాలాంధ్ర

**విశాలాంధ్ర-వేంపల్లి:** వాస్తవాలకు ప్రతిరూపం విశాలాంధ్ర దిన పత్రిక అని ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంటు బివి రమణా రెడ్డి అన్నారు. వేంపల్లిలో శనివారం విశాలాంధ్ర రూపొందించిన 2025 నూతన కేలండరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలు ఎప్పటికప్పుడు చేరవేయడంలో విశాలాంధ్ర దినపత్రిక దిట్టగా పేరుగాంచిందన్నారు. నేటి యువతరానికి విశాలాంధ్ర పత్రిక దిక్సూచి వంటిదని కొనియాడారు. కార్యక్రమంలో పాత్రికేయులు అమర్‌నాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శివారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మేమింతే.. అనుమతిలేనిదే అనుమతించం

### బయటే టిడిపి నేతనను అడ్డుకున్న సీఐ

### చేసేదేమీలేక వెనుదిరిగిన టిడిపి నేత రాఘవరెడ్డి

**విశాలాంధ్ర-పులివెందుల:** పులివెందుల పట్టణంలో శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరుగనుంది. అదే సమయంలో టిడిపి సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రాఘవరెడ్డి వ్యక్తిగత పనులమీద మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో అక్కడ గేటు వద్ద మున్సిపల్ కమిషనరు అనుమతిలేనిదే లోపలికి వెళ్లనీయమని, మీమింటే నంటూ పోలీసులు అడ్డుకున్నారు. తాను వ్యక్తిగగ పనిమీద వచ్చానని చెప్పినా పోలీసులు ససేమిరా అన్నారు. తమ కూటమి ప్రభుత్వంలోనూ ఆంక్షలేమిటంటూ చేసేదేమీలేకపోవడంతో రాఘవరెడ్డి అక్కడి నుంచి వెనుదిరిగారు.

## తిప్పిరెడ్డిపల్లెలో రెవెన్యూ గ్రామ సదస్సు

**విశాలాంధ్ర- మైదుకూరు :** మైదుకూరు మండల పరిధిలోని తిప్పిరెడ్డి పల్లె పంచాయతీలో శనివారం రెవెన్యూ గ్రామ సదస్సును భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్ణయించడంతో అందులో భాగంగానే ఆదిరెడ్డి పల్లె సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ సదస్సును తాహశీల్దార్, రాజసింహ నరేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో, మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, సర్పంచి బండి నాగేంద్రబాబు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

**విశాలాంధ్ర-రాయచోటి:** అన్నమయ్య జిల్లా రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్ కు వచ్చిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ పుష్పగుచ్చం అందజేశారు. స్టేట్ గెస్ట్ హౌస్ లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పోలీసులు గౌరవ వందనం చేశారు.

## కళావేదిక, క్యాంటీన్ ప్రారంభం

**విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కళా వేదికను, క్యాంటీన్ ను రాష్ట్ర కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ కుమార స్వామి, మాజీ ఎంఎల్‌ఏ డాక్టర్ శివరామకృష్ణారావ్ శనివారం ప్రారంభించారు. అనంతరం కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి కళాశాల అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్ రాజ్ , వడ్డమాను శ్రీనివాస కుమార్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సీపీఐ ఘన నివాళి

**విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ :** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల నాయకులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ భారతదేశానికి ఆర్బిఐ గవర్నర్ గా, ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా 2004 నుండి 2014 వరకు 10 సంవ త్సరాలు దేశానికి సేవలు అందించా రన్నారు. 33 ఏళ్లు రాజ్యసభ సభ్యునిగా, దేశ ప్రజలకు అందించడం, సమాచార హక్కుచట్టం, ఉపాధి హామీ పథకం, దేశ ప్రజలకు అంకితం చేయడం, అనారోగ్య కారణాలవల్ల ఆయన చనిపోవడం దేశ ప్రజలకు తీరని వారు కొనియాడారు. 1987లో ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారం ఇవ్వడం జరిగింది వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిపిఐ మండల కార్యదర్శి కేశవ, సునీల్ చెన్నయ్య, వీరయ్య, సాఫా, ఫిరోజ్, అధిక సంఖ్యలో మండల నాయకులు పాల్గొన్నారు

## శాస్త్రీయ విజ్ఞానం ద్వారా యువత దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి

**విశాలాంధ్ర-కడప వైవీయూ :** శాస్త్రీయ విజ్ఞానం ద్వారా దేశాన్ని ముందు వరుసలో ఉంచాలని యువతకు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాల ఓబయ్య, సభ్యులు సునీత పిలుపునిచ్చారు. శనివారం ఉదయం యోగి వేమన యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఇంటర్ డిస్టిక్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో మూడవ రోజు సైన్సు, మూఢ నమ్మకాల పైన విశాఖ యువతకు అవగాహన కల్పిం చారు. దేశంలో బలులు, చేతబడులు ప్రచారం కల్పిస్తున్నారని అలాంటి వాటిని నమ్మకుండా ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ప్రజలకు సుఖమయ జీవితాన్ని అందించే సైన్సును సమాజంలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత యువత తీసుకోవాలని కోరారు. సమాజంలో యువత అన్ని రంగాలలో ఎదిగేందుకు నిరంతర శ్రమ, కృషి, పట్టుదల అవసరమని నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర డైరెక్టర్ అన్సు మాన్ ప్రసాద్ దాస్ పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ డిస్టిక్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమానికి హాజరైన యువ బృందానికి సూచనలు, సలహాలు అందించారు. చెకుముకి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది.

**సిపి బ్రౌన్ గ్రంథాలయం సందర్శించిన విశాఖ జిల్లా యువత**

సమాజంలోని విషయాలను ప్రజలకు తెలియజేసే గ్రంథాలయాలను యువత నిరంతరం సందర్శించుతూ ఉండాలని రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ చింతకుంట

శివారెడ్డి కడప జిల్లా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అలనాడు రచయితలు తాళపత్ర గ్రంథాల పైన ఏ విధంగా అక్షరాలను లిఖించారు అనే విషయాన్ని యువజనలకు తెలియజేశారు. పుస్తకాలను చదవడం ద్వారా చరిత్ర ఆనవాళ్లను తెలుసుకునే దానికి మంచి అవకాశం ఏర్పడుతుందని అన్నారు.

**పెద్ద దర్గా సందర్శన**

చారిత్రక ప్రదేశాలను సందర్శించడం ద్వారా యువతకు పురాతన ప్రదేశాల పైన మమకారం ఏర్పడుతుందని దర్గా మేనేజర్ అలీ ఖాన్ అన్నారు. జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన అమీన్ పీర్ దర్గాను (పెద్ద దర్గా)ను విశాఖ యువత సందర్శించారు. అలనాడు గురువులు ప్రజలకు ఇచ్చిన సందేశాలను దర్గా ప్రతినిధులు యువతి, యువకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గాలివీడు ఎంపీడీఓపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి - డీహెచ్‌పీఎస్

**విశాలాంధ్ర-కడప రూరల్ :** గాలివీడు ఎంపీడీవో పై అతని కార్యాలయంలో తాళాలు వేసి భౌతిక దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కే మునెయ్య జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రగుప్తాలు నేడు రిమ్స్ హాస్పిటల్‌లో ఎంపీడీవో జవహర్ బాబును పరామర్శించి ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ అధికారులపై జరిగిన దాడులు నేడు కూటమి ప్రభుత్వ పాలనలో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడంలో విఫలమైంది, దళిత అధికారుల పైన జరిగిన దాడి సిగ్గు చేటు చర్య అన్నారు. సమస్యలు ఏదైనా ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి కానీ ఇలా ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో ఉండగా ప్రభుత్వ కార్యాలయాల్లో చొరబడి కార్యాలయానికి తాళాలు వేసి దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని డీహెచ్‌పీఎస్ గా తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. భౌతిక దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు న్యాయ స్థానంలో శిక్షలు పడేలా పోలీసులు వ్యవహరించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ టీడీపీ కూటమి ప్రభుత్వం బిజెపితో అంట కాగడం వలన దళితులపైన దాడులు అరికట్టంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలను అమలు చేయడంలో ఘోరంగా గత ప్రభుత్వము విఫలమైందన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో నాన్ బైలబుల్ కేసు కింద వెంటనే అరెస్టు చేసి దళితులపై దాడులు పురావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## వైసీపీ ప్రభుత్వంలోనే విద్యుత్ చార్జీలు పెంచింది

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్:** ట్రూ అప్ చార్జీలు, ఇలా మూడు రకాల చార్జీలు పెంపు వైసీపీ ప్రభుత్వంలోనే కదా అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పరిపాలన మూలంగా 35 వేల కోట్ల నుండి 38 వేల కోట్ల వరకు ప్రజలమీద బాదుడే బాదుడు భారం మోపింది నిజం కదా అని ప్రశ్నించారు. కాదు అంటే అసెంబ్లీలో చర్చ రండి అని డిమాండ్ చేశాడు. లోకేష్ బాబు పాదయాత్రకు జిఓలతో, మైకులు ఇవ్వకుండా అనేక రకాలుగా అండంకులు కల్పించినా ప్రజల మీద ప్రేమతో నడిచి తెలుగు ప్రజల మనసులను గెలుచుకున్నాడన్నారు. వైసీపీ వారికి ధర్నాలకు, నీరసనలకు టీడీపీ ప్రభుత్వం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్వేచ్ఛ కల్పించారని తెలిపారు. ప్రజల మీద చిత్తశుద్ధి, విశ్వాసం లేక మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 9 సార్లు కరెంట్ బిల్లులు పెంచారని ప్రజలకు వివరించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవీంద్ర చర్చకు సిద్ధమని డిమాండ్ చేశారనికి వైసీపీ వారు ఎవ్వరూ సిద్ధంగా లేరన్నారు. ఇప్పటికైనా ప్రజలమీద చిత్తశుద్ధి ఉంటే 11 మంది వైసీపీ ఎమ్మెల్యే లు అసెంబ్లీ లో ప్రజల సమస్యలమీద చర్చించాలని మరోసారి డిమాండ్ చేశారు.

## దారి సౌకర్యం కల్పించండి..అధికారుల దృష్టికి సమస్య

### ప్రజల వినతిపై ఎంపీడీవో పరిశీలన

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** మండల పరిధిలోని వైకోడూరు గ్రామం నుండి పాగేరు వంక మీదుగా అటు పొలాలకు ఇటు ఎర్రగుంట్ల-వేంపల్లి ప్రధాన రహదారిపైకి వెళ్లేందుకు వీలుగా ఉన్న రస్తా పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీరాజ్ ఏఈ వినయ్ అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. దశాబ్దాలుగా కోడూరు వాసులు ఈ దారి గుండా వెళ్లేవారని అక్కడి ప్రజలు అధికారులకు వివరించారు. అయితే ప్రస్తుతం వంక నీరు మడుగుగా మారి రాకపోకలకు అసౌకర్యంగా ఉన్న విషయాన్ని అధికారులకు వివరించారు. పశువుల కాపరులతో పాటు మృతదేహాల అంత్యక్రియల నిమిత్తం ఈ మడుగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వారు గుర్తుచేశారు. ఇక్కడ బ్రిడ్జిల నిర్మాణానికి వినియోగించే సిమెంటు పైపులను అమర్చి సిమెంటు రోడ్డు నిర్మించడం ద్వారా అసౌకర్యాన్ని తొలగించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ముఖ్యంగా వ్యవసాయ పనులపై వెళ్లేందుకు మహిళలు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రస్తా సౌకర్యాన్ని కల్పించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిస్థితిని క్షేత్రస్థాయిలో గుర్తించిన అధికారులు కోడూరు గ్రామ వాసుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని ఆశిద్దాం.

## భూముల రేట్లు విపరీతం .?

### నిరుపేద కుటుంబాల గృహాలు తొలగింపు పై బడా నేతల కన్ను? లబో దిబో మంటున్న బాధితులు

**విశాలాంధ్ర- సిద్ధవటం :** జ్యోతి గ్రామానికి వెళ్లే, రహదారి, ఇరువైపులా ఉన్న పంట పొలాల భూముల రేట్లు విపరీతంగా పెరగడంతో ప్లాట్లు బిజినెస్ కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి భూములు చదును చేస్తున్నారు. మండలంలోని జ్యోతి, గ్రామానికి వెళ్లే రహదారి సిద్ధవటం, రెవెన్యూసర్వే నెంబర్, 54, 378, నందు పంట పొలాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేసి జెసిబి యంత్రాలతో చదును చేస్తున్నారు భూముల అనుకుని కొంతమంది నిరుపేదలు గత 40 సంవత్సరాలుగా గృహాలు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు గృహాలు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ ప్రాంత గృహ నిర్వాహకులు షేక్ మహబూబ్, భాష మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా గృహాలు నిర్మించుకొని నిరుపేదలైన మేము జీవనం సాగిస్తున్నామని కొంతమంది భూములు కొనుగోలు చేసి మీ గృహాలు మా సర్వే నెంబర్ లో ఉన్నాయి అంటూ తొలగిస్తామని చెప్తున్నారని మా గృహాలకు సంబంధించి అన్ని పత్రాలు ఉన్నాయని అధికారులు పరిశీలించి మా నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. మండల ఇన్చార్జి తాసిల్దార్ మాధవి లత వివరణ కోరగా, గృహాలు తొలగింపు అనే విషయం నా దృష్టికి రాలేదని ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని అన్నారు.

## రాజంపేటలో మన్మోహన్ సింగ్ వైద్యులు సంతాపం

**విశాలాంధ్ర -కడప :** భారతదేశ మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు తెలియజేశారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి క్లిష్ట సమయాలలో దూర దృష్టితో ఆయన చేసిన సేవలు అభినందనలు ఏమన్నారు. కేంద్ర మంత్రిగా, ఆర్థిక వేత్తగా, ప్రధానిగా సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ మాధవ రెడ్డి, డాక్టర్ అబూబకర్, డాక్టర్ అమృత, డాక్టర్ నాగలక్ష్మి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఉద్యోగస్తులు

**విశాలాంధ్ర- సిద్ధవటం :** మండల అభివృద్ధి కార్యాలయం సిద్ధవటంలో శనివారం ఉద్యోగస్తులు సమయపాలన దిశగా విధులకు హాజరు కాక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వివరాలులోకి వెళితే మండల అభివృద్ధి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తులు 9 మంది ఉండగా అందులో టైపిస్టు ఉద్యోగి సమయపాలన దిశగా విధులకు హాజరయ్యారు విధులకు డుమ్మా కొట్టారు ప్రతిరోజు విధి నిర్వహణలో సమయపాలన దిశగా రాకుండా విధులపై నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంపీడీవో పని రాజకుమారి విధి నిర్వహణలో భాగంగా కడపలో ఉన్నారంటూ ఏవో లీవ్‌లో ఉందంటూ టైపిస్టు తెలియజేశారు. ఈ విషయమై డిప్యూటీ సీఈవో మైథిలి వివరణ కోరగా విధి నిర్వహణలో అలసత్యంపై విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

**విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం రామాపురం లక్కిరెడ్డిపల్లె రోడ్డు కళాశాల ఆవరణం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టూ పరిసరాలను కంపచెట్లను ప్లాస్టిక్ కవర్లకు నిప్పు పెట్టారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడడం పర్యావరణకే ముప్పు ఉంటుందని వీటిని తగ్గించాలని వాటి బదులు క్లాత్ కవర్లు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల ఎన్నో జంతువులు బలి అవుతున్నాయని ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటకృష్ణారెడ్డి అధ్యాపకులు కళ్యాణి శాంతయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్ పవన్ కళ్యాణ్ మొదలుపెట్టారు

### ఇదంతా చంద్రబాబు డైరెక్షనే .. వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ :** విద్యుత్ చార్జీలపై మేం చేసే పోరుబాటను డైవర్ట్ చెయ్యడానికి డైవర్షన్ పాలిటిక్స్ పవన్ కళ్యాణ్ మొదలుపెట్టారని, ఇదంతా చంద్రబాబు డైరెక్షన్లోనే జరుగుతుందని వైసీపీ కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎంపీడీవో జవహర్ బాబును పరామర్శించడానికి ఆగమేఘాలపై వచ్చారు అన్నారు. ఎంపీడీవోకు ఏమి కాకపోయినా ఆయనను రిమ్స్ కు తెచ్చి హడావిడి చేశారన్నారు. ఇవన్నీ కక్షపూరిత రాజకీయాలే అని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శనివారం సాయంత్రం వైసీపీ కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ఎవరిని పరామర్శించిన ఆహ్వానించదగినదే అని చెప్పారు. అయితే జరిగిన సంఘటన ఎంత తీవ్రమైంది అనేది కూడా చూడాలి అన్నారు. ఎంపీపీ కుమారుడు సుదర్శన్ రెడ్డి మండల ఆఫీసు సిబ్బంది పిలిస్తే వెళ్లారని తెలిపారు. అక్కడ ఎంపీపీ ఛాంబర్ కు తాళాలు వేశారు, ఓపెన్ చేయండి అని అడిగారు అన్నారు. ముందుగా పథకం ప్రకారం ఎంపీడీవో పై దాడి అంటూ వందల మంది టిడిపి వారు వచ్చేసారు అన్నారు. టిడిపి వారు రావడంతో అక్కడే తోపులాట జరిగింది, ఈ తోపులాటలో ఎంపీడీవో కుర్చీ పై పడి దెబ్బ తగిలింది అన్నారు. దాన్ని డిప్యూటీ సిఎం డైవర్ట్ చేసే కార్యక్రమం చేపట్టారు అన్నారు. చంద్రబాబు తన డైవర్షన్ పాలిటిక్స్ కోసం పవన్ కళ్యాణ్ ను పంపుతున్నారు అని తెలిపారు. గాలివీడు సంఘటనను కూడా అలాగే ఉపయోగించుకున్నారు అన్నారు. ముందుగానే ఎవరిపై కేసు పెట్టాలో కూడా నిర్ణయించుకున్నారు అని తెలిపారు. ఎంపీడీవో కు ఏమీ కాకపోయినా ఆయనను రిమ్స్ కి తెచ్చి హడావిడి చేశారన్నారు. సింహాద్రిపురం మండలం దుద్దకుంటలో ఒక రైతు కుటుంబం చనిపోయింది, రైతుకు మద్దతు ధర లేకపోవడం వల్ల పంట నష్టం ఇవ్వని కారణంగా ఆ రైతు కుటుంబం ఆత్మహత్యకు వడిగట్టారన్నారు. అదే జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే ఆ రైతు కుటుంబం చనిపోయేది కాదు అన్నారు. ప్రశ్నిస్తాను అనే పవన్ కళ్యాణ్ రైతు కష్టాలపై ఎందుకు ప్రశ్నించారు అన్నారు. ఇంత దూరం వచ్చిన పవన్ కళ్యాణ్ ఆ రైతు కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఆడే డ్రామాలో పవన్ కళ్యాణ్ యాక్టింగ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కు వద్దకు ఎందుకు వెళ్ళడం లేదు?, ఉక్కు ఉద్యోగుల తరఫున పవన్ ప్రశ్నించవచ్చుగా?, విద్యుత్ చార్జీలు పెంచను అని హామీ ఇచ్చి పెంచుతుంటే పవన్ కళ్యాణ్ ప్రశ్నించవచ్చుగా? అన్నారు. ప్రశ్నించే గొంతు మూగబోయిందా, మీరు అధికారంలో ఉన్నా జగన్ ను మాత్రమే ప్రశ్నిస్తావా అన్నారు. పిఠాపురంలో జాన్ అనే జనసేన నాయకుడు ఓ మైనర్ బాలికను రేప్ చేస్తే ఎందుకు పరామర్శించలేదు చెప్పాలన్నారు. మీ ఎమ్మెల్యే నానాజీ ఒక సీనియర్ ప్రొఫెసర్ పై దాడి చేస్తే నువ్వు ఎందుకు కట్టడి చేయలేదు అన్నారు. కానీ డైవర్ట్ చెయ్యడానికి గాలివీడు వచ్చి చంద్రబాబు చెప్పినట్లు పవన్ కళ్యాణ్ నటిస్తున్నాడన్నారు. కమలాపురంలో అక్రమ ఇసుకను అడ్డుకున్నందుకు ఒక వీఆర్వో ను బీరు బాటిల్ తో టిడిపి నేత తలపగలగొడితే నువ్వెందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తగిన సమయంలో ప్రజలే నీకు, మీ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, నిత్యానంద రెడ్డి, తిరుపాల్ రెడ్డి, రామ లక్ష్మణ్ రెడ్డి, శ్రీ రంజన్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

## ఎస్.టి.యు ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సలహాలు ఇస్తుంది

**విశాలాంధ్ర జమ్మలమడుగు :** ఎస్.టి.యు రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రభుత్వానికి ఆచరణాత్మకమైనటువంటి సూచనలు సలహాలు ఇస్తుందని రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం జమ్మలమడుగు పట్టణానికి విచ్చేసిన ఆయన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2025 డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణా రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు ఈ మూడు నెలలు కష్టపడి మంచి రిజల్ట్ తీసుకురావడానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే బదిలీలు, ప్రమోషన్లు సకాలంలో నిర్వహించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. జమ్మలమడుగు అంటే అభిమానమని తాను ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు ఈ ప్రాంతంలోనే చదివానని ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.టి.యు రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ రీజనల్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, సాంకేతిక కమిటీ కన్వీనర్ మహమ్మద్ గౌస్ మూడు మండలాల ఎంఈఓ లు చంద్రశేఖర రావు, చౌడయ్య ,చిట్టిబాబు మరియు ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, శివ శంకర్ ప్రసాద్, వివేకానంద కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ఎస్టియు కార్యకర్తలు మూడు మండలాలు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## సర్దుబాటును ఉర్దూ కాంప్లెక్స్‌లోనే జరిపించాలి

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ :** కడప నగర పాలక సంస్థ లోని నగరపాలక ప్రాథమిక ,ప్రాథమికోన్నత పాఠశాలలు నగర పాలక ఉన్నత పాఠశాలలో సర్దుబాటు చెయ్యాలని కడప మండల విద్యాధికారి గంగిరెడ్డిని ఎస్టియు కడప నగర శాఖ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మునిసిపల్ కన్వీనర్ , అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతము కాంప్లెక్స్ లో మునిసిపల్ మేనేజ్మెంట్ పాఠశాలలు ఇతర మేనేజ్మెంట్ లోకి, తెలుగు పాఠశాలలు ఉర్దూ కాంప్లెక్స్ లోకి మాపింగ్ చేయడం జరిగిందన్నారు... ప్రస్తుతం సి ఎస్ ఈ అధికారులు నుంచి మార్పులు, చేర్పులు అవకాశం ఇచ్చారు కనుక భవిష్యత్ లో స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్స్ కు డీడీఓ పవర్స్ ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. భవిష్యత్ లో ఇబ్బంది రాకుండా మండల విద్యాధికారిని గంగిరెడ్డి ని మున్సిపల్ మేనేజ్మెంట్ లోని స్కూల్స్ మునిసిపల్ మేనేజ్మెంట్లో ఉండేలాగా చూడాలని కోరామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎస్ టి యు నగర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాదిక్ అలీ, సంజీవ రాయుడు జిల్లా మున్సిపల్ కమిటీ సభ్యులు ఎస్ఎండి దావూద్ ఎస్టియు నగర శాఖ నాయకులు ఆసిఫ్ అహ్మద్ భాషా జుబేర్ తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అసౌకర్యం కల్గనీయొద్దు

### ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు

**విశాలాంధ్ర-కడప :** పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అసౌకర్యం కల్గనీయొద్దని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు సూచించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ఈనెల 30 నుండి జనవరి 8 వరకు పరీక్షలు నిర్వహణ. హాజరు కానున్న పురుష అభ్యర్థులు 3,779, మహిళా అభ్యర్థులు 713 మొత్తం కలిపి 4,492 మంది. ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లుండాలి. హై స్పీడ్ ఇంటర్నెట్, అడ్వాన్స్డ్ సిస్టమ్స్ మరియు ప్రింటర్స్‌ను సమకూర్చుకొని వెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా చూసుకోవాలని సూచనలు. నియామక ప్రక్రియ యావత్తు సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చర్యలుండాలి. పరీక్షల నిర్వహించే ప్రతి ప్రదేశం కెమెరా పర్యవేక్షణ ఉండేలా ఖచ్చితమైన ఏర్పాట్లు చేయాలి. అభ్యర్థులు జిల్లా పోలీస్ కేంద్రంలోనికి అడుగుపెట్టిన దగ్గర్నుంచి ఎవరికి ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ జరిగే అన్ని ప్రదేశాలను సూచించే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రన్నింగ్ ట్రాక్ మొత్తం తిరిగి ఇంకా చేయాల్సిన పనుల గురించి దిశానిర్దేశం చేశారు అభ్యర్థులకు టాయిలెట్లను, మంచినీటి సదుపాయం, వైద్య సదుపాయం, ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. అదేవిధంగా వారి వెంట తెచ్చుకునే బ్యాగులు, సెల్ ఫోన్లు భద్రపరిచి తిరిగి వెళ్లే సమయంలో అందజేయాలన్నారు. సెన్సార్ ద్వారా జరిగే ప్రక్రియ మొత్తం సైంటిఫిక్‌గా ఎలాంటి అవరోధాలు లేకుండా చూసుకోవాలని, మ్యాన్యువల్ గా జరిగే ప్రదేశంలో పూర్తి పారదర్శంగా నిర్వహించాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు తెలిపారు. రిక్రూట్మెంట్‌లో పాల్గొనే సిబ్బంది మరియు అధికారులు తెల్లవారుజామున 4 గంటలకే విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, డి.టి.సి డీఎస్పీ అబ్దుల్ కరీం, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి జ్యోతి, డి.టి.సి సి.ఐ వినయ్ కుమార్ రెడ్డి, ఆర్.ఐ లు ఆనంద్, శ్రీశైల రెడ్డి, జిల్లాలోని పోలీస్ అధికారులు, పలువురు జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, ఐ.టి కోర్ టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్ లో అన్ని పాఠశాలలు పాల్గొనండి

**విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి :** ఏపీ మోడల్ స్కూల్లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చక్కెరనాయక్ ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్లు తెలిపారు ఈ సైన్స్ వేర్ 28 తేదీన పాఠశాల స్థాయిలో నిర్వహించారని పాఠశాల స్థాయిలో నిర్వహించిన ప్రాజెక్టులను మండల స్థాయిలో నిర్వహించి అత్యుత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి సైన్స్ వేరుకు పంపిస్తామని ఈ సైన్స్ పేరుకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు పాల్గొనాలని వారు తెలిపారు ఈ సైన్స్ వేర్ లో 8 9 10 తరగతి విద్యార్థులు పాల్గొనాలని వారు తెలిపారు.

# వైసీపీ ధర్నాలో ప్రజల్లో స్పందన లేదు

### ఆందోళన పేరుతో డ్రామాలాడిన వైసిపి

### విద్యుత్ ఛార్జీల పెంపు భారం వైసీపీదే

### అవినీతికి కేరాఫ్ వైసిపి - వైసీపీ పై విరుచుకుపడ్డ టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు ఉనికి కోసమే ఆందోళన పేరుతో జగన్ రెడ్డి డ్రామాలాడు తున్నారని, వైసీపీ ప్రభుత్వంలో కరెంట్ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం దెయ్యాలు వేదాలు వల్లించి నట్టు ఉందని టిడిపి శ్రేణులు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి మరోసారి పెంచడానికి అనుమతి తెచ్చుకున్న జగన్ రెడ్డి కు ప్రజలు జీవితాంతం గుర్తుండేలా గుణపాఠం చెప్పి ఘనంగా సన్మానించారని వారు గుర్తు చేశారు. పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ కార్యాలయంలో కూటమి శ్రేణులు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ చార్జీలు పెంచారని నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలకు పిలుపు ఇవ్వడం వారు పెంచిన చార్జీలు వారే ధర్నాలు, నిరసనలు చేయడం వైసీపీ పార్టీ అవినీతికి కేరాఫ్ అడ్రస్గా మారిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాల కారణంగా విద్యుత్ చార్జీలు భారీగా పెంచుతూ ప్రజలపై పెను భారం మోపారని ఆ పాపం జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు. వైసిపి చెసే ధర్నాలకు, నిరసనలకు ప్రజల్లోనే కాదు సొంత పార్టీలో కూడా స్పందన లేదని, కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రజలపై 35 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడమే కాకుండా 1.20 లక్షల కోట్లు నష్టాన్ని విద్యుత్ శాఖలో పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

### నివాళులర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మదనపల్లె: ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ఎమ్మెల్యే షాజహాన్ భాష పేర్కొన్నారు... నేడు మదనపల్లిలోని తమ నివాసం వద్ద మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఆర్థికమంత్రిగా, భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ చేసిన సేవలను దేశం ఎన్నటికీ మర్చిపోదన్నారు. ఆర్థిక మంత్రిగా ప్రపంచీ కరణతో భారతదేశాన్ని తిరుగులేని శక్తిగా మార్చిన ఘనత ఆయనదన్నారు. ఆయన లేని లోటు భర్తీ చేయలేమన్నారు. మన్మో హన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారని అన్నారు. ఈకార్యక్ర మంలో టిఎన్టియుసి మదనపల్లి మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు కాసిం కమలామరి కృష్ణ, జీవీ నాయుడు, గురునాథ్ యాదవ్, జెసిబి వేణు, నందిని రాయల్, శ్రీరామ వినోద్, విజయమ్మ, బీసీ నాయకులు నాగయ్య, రెడ్డి రాయల్, నాయి బ్రాహ్మణ సంఘం ప్రభాకర్, మంజునాథ్, జెసిబి ఈశ్వర్ నాయుడు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

## ఎంపిడిఓపై దాడి అమానుషం

విశాలాంధ్ర- పీలేరు: దళిత ఎంపిడిఓ జవహర్ బాబుపై వైసీపీ దాడి చేయడం అమానుషమని పీలేరు టీడీపీ ఎస్ సిసెల్ నాయకుడు కప్పరం చంద్రయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్నమ్మయ్య జిల్లా రాయచోటినియోజకవర్గంలోని గాలివీడు దళిత ఎంపిడిఓ జవహర్ బాబు పై గాలివీడు వైసిపి నాయకుడు సుదర్శన్ రెడ్డి దాడి చేయడం చాలా దారుణం అని ఒక ప్రభుత్వ హోదా లో వున్నా అధికారి పై దాడికి దిగడం అప్రజాస్వామికం అని ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమని సంఘటనకు సంబందించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

# పట్టణంలో రూ.96 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ

## ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

విశాలాంధ్ర-మదనపల్లె: పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా శ్రీకారం చుట్టారు. శనివారం పట్టణంలోని 2,3,8,10,32,34 వార్డులలో చైర్ పర్సన్ మానూజా రెడ్డితో కలిసి 96 లక్షలతో సీసీ రోడ్లు డ్రైనేజీల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో మదనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. దీంతో వైసిపి కౌన్సిలర్ల విజ్ఞప్తి మేరకు పట్టణంలోని పలు వార్డులలో అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్లు,డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. రాజకీయాలకతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే పట్టణంలో సిటిఎం రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని,వార్డుల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యస్తున్నామన్నారు. అనంతరం చైర్ పర్సన్ మనూజా రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం సిసి రోడ్లు,డ్రైనేజీల నిర్మాణం వేగవంతం చేశామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మదనపల్లి మున్సిపాలిటీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు కరీముల్లా, శివయ్య,నాగార్జున బాబు,టిడిపి నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబలి వెంకటరమణారెడ్డి,రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రఘుపతి నాయుడు,కంచర్ల మల్లికార్జున నాయుడు, కమలామ్రి కృష్ణ,మోడెం సిద్ధప్ప,బీదం గురునాథ్ యాదవ్,జీవి నాయుడు, నాయి బ్రాహ్మణ సంఘం ప్రభాకర్, బాలమాలి శేఖర్,జెసిబి మధు,జేసీబీ వేణు,వేల్పుల వెంకటేష్, బండి పవన్ కుమార్, బాబా, వేమయ్య, మంజునాథ్, జాఫరున్నీసా,రెడ్డి బూ,నాగమణి పెద్దఎత్తున టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర-పులివెందుల: లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి రామకృష్ణయ్య మాట్లాడుతూ పుట్టుకతోనే ఎవరూ మేధావులుగా జన్మించరని, కఠోరశ్రమతో, నిరంతర అభ్యాసంతో, ఉపాధ్యాయుల దార్శనికతతో కూడిన విద్యాబోధనతో విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా మారతా రన్నారు. మాజీ రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా. అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, విద్యార్థులందరిలో ఏదో ఒక నైపుణ్యం అంతర్గతంగా దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి వెలికి తీయడమే ఉత్తమ ఉపాధ్యాయుల కర్తవ్యమన్నారు. న్యూటన్, థామస్ ఆల్వా ఎడిసన్, సర్ సివి రామన్, ఐన్ స్టీన్ లాంటి శాస్త్రవేత్తలు మన మధ్యే ఉన్నారని , పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే ఉపాధ్యాయుల గురుతరబాధ్యతని రామకృష్ణయ్య పేర్కొన్నారు. అనంతరం వివిధ హైస్కూళ్ల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, గణిత నమూనాలను పరిశీలించి తగు సూచనలు అందించారు. తదనంతరం అత్యుత్తమ నమూనాలు ప్రదర్శించిన ఇప్పట్ల ప్రతిభా గురుకుల బాలికల పాఠశాల, జిల్లాపరిషత్ హైస్కూల్ కోమన్నుతల, జిల్లాపరిషత్ హైస్కూల్ పెదకుడాల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి, జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కు ఎంపికయ్యారు. మండలస్థాయి విజేతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు. కార్యక్రమంలో లింగాల హైస్కూల్ ఇన్చార్జి ప్రధానోపా ధ్యాయులు గజ్జల సురేష్ రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, రఘునాథరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, వీరభాస్కర్, సీఆర్పీలు జయచంద్రారెడ్డి, గంగరాజు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

### ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు

## విచారణలో అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు పట్టణంలో భారతీయ అంబేద్కర్ సేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ లు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణపై అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండి పడ్డారు. ఈ సందర్భంగా పాలకుంట శ్రీనివాసులు, తుమ్మల ధరణి కుమార్ లు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం, కలకడ మండలం, ఏనుగొండపాళ్యం పంచాయతీ, బండమీద పల్లి ఎస్సీ కాలనీకి చెందిన యాకల రెడ్డెప్పపై అదే గ్రామంలో అగ్రవర్ణ కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కుల దురంకార భావంతో దాడి చేసి తీవ్ర పరుష పదజాలంతో దూషించడంతో ఈ నెల 19 న దాడికి పాల్పడిన మహేష్ నాయుడు, ప్రసాద్ నాయుడు, వీరాంజనేయులు నాయుడు,లపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నేటికీ పది రోజులు కావస్తున్న ఇంతవరకు సంబంధిత అధికారులు బాధిత రెడ్డెప్ప కుటుంబాన్ని విచారించకపోవడంలో అధికారుల ఆంతర్యం అంతు పట్టడం లేదని మండిపడ్డారు. ఇకనైనా సంబంధిత పోలీస్ శాఖ వారు బాధిత రెడ్డెప్ప కుటుంబానికి రక్షణ కల్పించి, విచారణ వేగవంతం చేసి సత్వర న్యాయం చేసి నిందితులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలో చలో రాయచోటి పిలుపునిస్తామని వీరు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ఎర్రబల్లి మల్లికార్జున, ముల్లంగి గురువయ్య, మాలమహానాడు నాయకులు జెట్టి దుర్గా ప్రసాద్, తుమ్మల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## బహిష్కరణ ఓ డ్రామా: చైర్మన్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల మున్సిపల్ కార్యాల యంలో కౌన్సిల్ సమావేశానికి ఎవ్వరూరాలేదని అందుకు తాను బహిష్కరించానని ఎమ్మెల్సీ రామగోపాల్రెడ్డి చెప్పడం ఓ డ్రామా అని చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆ మేరకు ఆయన కౌన్సిల్ సమావేశం గురించి మీడియాకు వివరిం చారు. ఆయన మాట్లాడుతూ అజెండాలో చెప్పిన విధంగా ఒక 20 నిమిషాలకు కౌన్సిల్ ప్రారంభించామన్నారు. ఎమ్మెల్సీ అందరి కంటే ముందే వచ్చి ఇంకా ఎవ్వరు రాలేదు అని చెప్పటం హాస్యాస్పద మన్నారు. ముందు నెల ఎమ్మెల్సీ కొన్ని హామీలు ఇవ్వడం జరిగిం దని, కాంట్రాక్టు బిల్స్ గురించి, అలాగే కొన్ని అభివృద్ధి పనుల గురించి నిధులు తెస్తాం..అని చెప్పడం జరిగిందన్నారు. అయితే ఇప్పుడు ఆ సమస్యల మీద నిలదీస్తారనే ఉద్దేశ్యంతో కొత్త పంత పాడుతూ బాయ్ కాట్ చేస్తున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. పబ్లిసిటీ స్టంట్ కోసమే బాయకాట్ చేశారు తప్ప ఇంకోటి కాదన్నారు. ఎప్పుడు కౌన్సిల్ మీటింగ్కు వచ్చినా మిమ్మ లని, నిలదీస్తాం వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు.

# విద్యుత్ ఛార్జీలపై వైకాపా పోరుబాట హాస్యాస్పదం

## టిడిపి నాయకులు నాగూర్ వలి విమర్శలు

విశాలాంధ్ర-మదనపల్లె : విద్యుత్ ఛార్జీలపై వైకాపా పోరుబాట చేపట్టడం హాస్యాస్పదమని టిడిపి నాయకులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా) ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు పాపం గత సీఎం వైఎస్ జగన్,ఆ పార్టీ విధానాలే కారణమన్నారు. మాజీ సీఎం జగన్ పాపాలు నేడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని,గడచిన ఐదేళ్లలో ట్రూ ఆఫ్ ఛార్జీల పెరుగుదలకు కర్త,కర్మ,క్రియ జగనేనన్నారు. యూనిట్ విద్యుత్తు 5కే దొరుకుతున్నా జగన్ కొనలేదని,కమిషన్లకు కక్కుర్తి పడి యూనిట్ విద్యుత్తు రూ.8కి కొన్నారని విమర్శించారు. మదనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వార్డులలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు మున్సిపల్ అధికారులు ప్రోటోకాల్ నిబంధన పాటించడం లేదని పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించడం సబబు కాదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా కుల,మత,రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికైనా వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీ నాయకులు వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ్ ప్రతాప్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మదనపల్లి : మదనపల్లి నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శివరాం ప్రతాప్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకి ఘనంగా సన్మానించి కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ ఖాన్ శ్రీకృష్ణ థియేటర్స్ (గ్రూప్స్) యజమాని మార్పురి శశిధర్ .,కట్ట దొర స్వామినాయుడు . ఆర్కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## రతన్ టాటాకు నివాళులు అర్పించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: రతన్ టాటా జయంతి సందర్భంగా పట్టణంలోని జనసేన కార్యాలయంలో జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళీ రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పు, ఉక్కు వరకు కర్మాగారాలు నియమించి ఎందరికో నిరుద్యోగ సమస్యను తీర్చడంతో పాటు, దేశం ఆర్థిక అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తూ భారతదేశ సేవ కోసమే భారతదేశంలో జన్మించినటువంటి భారతీయ ముద్దుబిడ్డ అని, కరోనా కష్టకాలంలో భారతీయ ప్రజల కోసం నా యావదాస్తి ఇవ్వడానికి అయినా సిద్ధం అని ప్రకటించిన గొప్ప మహనీయులు అని పేర్కొన్నారు. అటువంటి మహనీయుడికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజి, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుని మృతికి

# దేశం నాయకుల సంతాపం

### టిడిపి నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-అట్లూరు: టిడిపి ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణు స్వరూప్ శనివారం గుండెపోటుతో మృతి చెందడంపై బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు మంచూరు సూర్యనారాయణ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వీరితోపాటు అట్లూరు మండలం తదితర దేశం నాయకులు మండల సీనియర్ నాయకులు నందగోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, బద్వేల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి రుషికేశవ, మండల నాయకుడు పోతిరెడ్డి రెడ్డయ్య, తెలుగు యువత అధ్యక్షులు జయ కృష్ణారెడ్డి, యువ నాయకుడు బోవిల్ల విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్ ( బాబా), మరో సీనియర్ నాయకులు ఉప్పుతి రామకృష్ణారెడ్డి, పొన్నవోలు సాంబశివరెడ్డి, తదితర దేశం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఈ సందర్భంగా బెంగళూరు నుండి ఫోన్లో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య తనయుడు చిన్న వయసులోనే గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ వయసులోతన కుమారుని కోల్పోయిన రామచంద్రయ్య మనసులో దేవుడు ధైర్యం నింపాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నామని వారు తెలియజేశారు.

## అన్-లిమిటెడ్ రెస్టారెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక విజయకుమార్ సర్కిల్ వద్ద అన్‌లిమిటెడ్ మల్టీకజిన్ రెస్టారెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్‌లిమిటెడ్ రెస్టారెంట్ నిర్వాహకులు నిఖిల్, అశోక్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్‌లిమిటెడ్ రెస్టారెంట్‌లు 5 ఏర్పాటుచేయగా రాయలసీమలోని కడప జిల్లా ప్రొద్దుటూరులో 6వ బ్రాంచ్‌ను ఏర్పాటుచేసి ప్రారంభం సందర్భంగా రూ.6కే బిరియాని అందిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల ఐటమ్స్‌ని అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## ఎంపీడీవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-రామసముద్రం : గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు పై దాడి చేసిన అన్నమయ్య జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శివ శంకర్ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చిన్ను డిమాండ్ చేశారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఎంపీడీవో పై దాడి చేయడం రాక్షసత్వంగా అభివర్ణించారు విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే ఎంతటి వారైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో స్థానికం రాజేష్ బీసీ సెల్ వెంకటరమణ మోడల్ స్కూల్ ఎస్ఎంసి కమిటీ చైర్మన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు

# గాలివీడు ఎంపీడీఓపై దాడి దారుణం

మాల మహానాడు ఐక్యవేదిక

విశాలాంధ్ర- పీలేరు : అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడి చేసిన మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి పై రౌడీ షీట్ ఓపెన్ చేయాలని మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేసారు.పీలేరు పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడి చేసిన సుదర్శన్ రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, ఆత్మహత్య యత్నం నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుత్తం నారాయణ, రాయలసీమ రీజనల్ కన్వీనర్ చీకటిపల్లి రామాంజులు, అన్నారు. సుదర్శన్ రెడ్డి తన అనుచరులను వెంటపెట్టుకుని ఎంపీపీ సభా భవనం లో మందు, విందు చేసుకోవడానికి ఎంపీడీఓ జవహర్ బాబు తిరస్కరించి నందుకు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు.సుదర్శన్ రెడ్డి ఎంపీపీ సభా భవనం లో ఉండడానికి ఏ విధమైన హర్హత లేదని అలాంటి వ్యక్తి దాడి చేయడం అన్యాయం అన్నారు. సుదర్శన్ రెడ్డి న్యాయవాది అయినప్పటికీ, అలాంటి లక్షణాలు లేవని, కేవలం దళితుడని ఆయన అనుచరులు దాడి చేయడం మేము తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నక్కా వెంకటరమణ డివిజన్ అధ్యక్షులు డి . రమణ, కె.వి పల్లి మండల అధ్యక్షులు ఊటుపల్లి.రమణ, గుత్తం లోకానాదం, మల్లేపల్లి చంద్రయ్య, గుర్రం రామకృష్ణ, పల్లెం నాగరాజా, తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ నిధులతో

## పంచాయతీని అభివృద్ది పరచండి: సర్పంచ్

విశాలాంధ్ర- పీలేరు: ఎంపీ నిధులతో పీలేరు పంచాయతీని అభివృద్ది పరచాలని పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా ఎంపీ. మిథున్ రెడ్డి ని కలిసి చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన పీలేరు పంచాయతీ అభిరుద్ది ప్రస్తుతం అభిరుద్ది కి నోచుకోవడం లేదని అన్నారు. ఎంపీ. నిధులను కేటాయించైన అభిరుద్ది చేయుటకు తోడ్పాటు అందించాలని ఎంపీని కోరడం జరిగిందని తెలిపారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారాని సర్పంచ్ హబీబ్ తెలిపారు.

## చల్లా రాజగోపాల్‌ను రియల్ హీరో అంటున్న యువకులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, కృష్ణాలయ కమిటీ చైర్మెన్ చల్లా రాజగోపాల్ యాదవ్ చేస్తున్న అన్నదానాన్ని చూసి యువకులు ప్రశంసిస్తున్నారు. శనివారం సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్న ప్రసాదంలో పెద్ద శెట్టిపల్లి గ్రామానికి చెందిన కె.ఇమామ్ వారి స్నేహితులు చల్లా రాజగోపాల్ యాదవ్ చేస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అక్కడ వారు భోజనం చేసి అనంతరం వారు మాట్లాడుతూ నిజంగా మీరు రియల్ హీరో అన్నగారు అని, వారానికి 1000మందికి అన్నదానం చేస్తున్నారంటే చాలా గొప్ప మనసు ఉండాలని అన్నారు. సినిమాల్లో హీరోలను హీరోలు అంటారు కానీ వారు కాదు హీరోలు మీరు రియల్ హీరో అని చల్లా రాజగోపాల్‌ను అన్నారు. పేద ప్రజలకు ఒక్కపూటైన కడుపు నిండా అన్నం పెట్టాలనే దృఢ సంకల్పంతో ఈరోజు నెలకు దాదాపు 5000మందికి ఆకలి తీరుస్తున్నారంటే అది చాలా గొప్ప విశయం అని, అది అందరి వల్ల కాదని అది ఒక చల్లా రాజగోపాల్ యాదవ్ గారికే సాధ్యమైందని వారు ఆయనను ప్రశంసించారు.

### కాపు సేవాలయ సొసైటీ ఆధ్వర్యంలో

## 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- మదనపల్లె: మదనపల్లి పట్టణానికి చెందిన తోట నరసయ్య ఆధ్వర్యంలో స్థాపించబడిన శ్రీకృష్ణ దేవరాయ కాపు సేవాలయ సొసైటీ చేస్తున్న విస్తృత సేవలో భాగంగా 2025 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ను స్థానిక బెంగళూరు రోడ్డులోని ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవరాయ కాపు సేవాలయ సొసైటీ ఫౌండర్ వెంకట నర్సయ్యతో పాటూ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ తేజ రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు ఆంజనేయ కుమార్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఆకుల కృష్ణమూర్తి, కాపు నాయకులు సుబ్బారెడ్డి, మురళి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ మృతికి కౌన్సిల్ సంతాపం

### సమావేశం వాయిదా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపల్ అత్యవసర సమావేశం శనివారం మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని సమర్ధవంతమైన ప్రధానిగా దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచి పోయిన గొప్ప వ్యక్తి అని, ఆయన మృతికి కౌన్సిల్ సంతాపం వెలిబుచ్చి సమావేశం వాయిదా వేయాలని కోరడంతో చైర్పర్సన్ కౌన్సిల్ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సార్ఐటి అధ్యాపకురాలికి డాక్టరేట్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు పి.షబానాబి "ఇన్ఫ్లుయెన్స్ ఆఫ్ పర్సెప్షన్ అండ్ ఎక్స్‌పెక్టేషన్ ఆన్ డెసిషన్ మేకింగ్ టువార్డ్స్ సెలెక్షన్ ఆఫ్ ఎంప్లాయర్ బ్రాండింగ్ విత్ రిఫరెన్స్ టూ ద ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్" అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించినందుకు గాను చెన్నైకి చెందిన వెల్‌టెక్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రధానం చేశారని ప్రిన్సిపాల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

## మన్మోహన్ సింగ్ సంస్కరణలు చిరస్థాయిగా ఉంటాయి

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మన్మోహన్ సింగ్ మన మధ్య లేకున్నా ఆయన తెచ్చిన సంస్కరణల రూపంలో దేశంలో ఎప్పటికి చిరస్థాయిగా ఉంటారని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష తెలిపారు. శనివారం నాడు ప్రొద్దుటూరు కౌన్సిల్ సమావేశంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణాన్ని చింతిస్తూ పాలకమండలి సభ్యులంతా నివాళులు అర్పించిన అనంతరం ఇర్ఫాన్ బాష మాట్లాడుతూ చిన్న గ్రామంలో పుట్టి, ఉన్నత చదువును అభ్యసించి, అంచెలంచెలుగా ఎదిగి దేశ ప్రధానిమంత్రి అవ్వడం ఎంతో గొప్ప విషయం అని కొనిఆడారు. మన్మోహన్ సింగ్ భౌతికంగా మనకు దూరమైన ఆయన ఆశయాలు, ఆకాంక్షలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.

## కొత్త మాధవరంలో మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన

### ఒకరికొకరు పోటీ తత్వంతో, ఇష్టపడి చదవాలి - ఎంఈఓ ప్రభాకర్

**విశాలాంధ్ర - ఒంటిమిట్ట :** విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం, బెంగళూరు వారి సహకారంతో కమీషనర్ పాఠశాల విద్య, ఎస్ పి డి సమగ్ర శిక్ష, డైరెక్టర్ ఎస్ సి ఈ ఆర్ టి , కడప జిల్లా విద్యాశాఖాధికారి యూవ్ మీనాక్షి ఆదేశాలనుసారం కొత్త మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం ఎన్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్ఐఎస్ఎఫ్-2025 పోటీలను ఒంటిమిట్ట మండల స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్త మాధవరంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంటిమిట్ట మండల విద్యాశాఖ అధికారి డి ప్రభాకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డిసెంబర్ 27వ తేదీ పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించడం జరిగిందని, 28న మండల స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతి మాధవరంలో నిర్వహించడం జరిగిందని అన్నారు. మండల పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి 42 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరయ్యారని అన్నారు. వ్యక్తిగత ప్రాజెక్టులలో మొదటి బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్త మాధవరం విద్యార్థి అయిన ఎస్ వి కార్తీక్ గెలుచుకొనగా, ద్వితీయ స్థానంలో మాధవరం ఏపీఎస్ కు చెందిన జి గౌతమి, తృతీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ మండపం పల్లికి చెందిన పి అభిషేక్ నిలిచారు. గ్రూప్ యాక్టివిటీస్ లో జడ్పీహెచ్ఎస్ ఒంటిమిట్టకు చెందిన టీ శివ కార్తీక్, ఫయాజ్ ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ మాధవరం కు చెందిన ఎస్ సాయి మహేష్, తృతీయ స్థానంలో ఎస్ ఎన్ వై ఎస్ కొత్త మాధవరం కు చెందిన ఎస్ కీర్తి నిలిచారన్నారు. ఉపాధ్యాయుల ప్రాజెక్టులో జిల్లా పరిషత్ కొత్త మాధవరం పాఠశాలకు చెందిన సోషల్ ఉపాధ్యాయులైన ఎస్. షహ జమీర్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వారికి బహుమతి ప్రధానం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి మాట్లాడుతూ మండల స్థాయిలో తమ పాఠశాలలో పోటీల నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తూ ఉన్నామని అన్నారు. భౌతిక శాస్త్రము, రసాయన శాస్త్రము, గణిత శాస్త్రము, పర్యావరణ శాస్త్రము, ఇంజనీరింగ్, బయో సైన్స్, కంప్యూటర్ సైన్స్ తదితర అంశాలలో విద్యార్థులు ప్రాజెక్టను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ పోటీలను టీచర్ ఎగ్జిబిట్, విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిక్యూటివ్, విద్యార్థుల గ్రూపు ఎగ్జిబిట్ అను మూడు విభాగాలలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి పట్టుదలతో, కసితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గొప్ప సైంటిస్టులుగా తయారు కావాలని వారు విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, కొత్త మాధవరం పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

**విశాలాంధ్ర-రామాపురం :** కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని మండల కేంద్రంలో రామాపురం. గువ్వలచెరువు. ప్రాంతాలలో శనివారం పెద్ద ఎత్తున టిడిపి నాయకులు. జన సేన నాయకులు. పార్టీల కార్యకర్తలు. మహిళలు ప్రజల పవన్ కళ్యాణ్ అభిమానులు. రామాపురం గువ్వల చెరువుకు చేరుకొని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. కాన్వాయతో కడప నుంచి గాలివీడుకు వెళుతున్న పవన్ కళ్యాణ్ ప్రజలను చూసి కాన్వాయ్‌ని ఆపారు. ప్రజలకు అభివాదం చేసి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పవన్ కళ్యాణ్ చూసేందుకు ప్రజలు ఎగబడి కేరింతలు కొట్టారు.

## సయ్యద్ షావలి, దర్గా, ఉరుసు ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు

**విశాలాంధ్ర- సిద్దవటం :** సయ్యద్ షావలి దర్గా, ఉరుసు మహోత్సవాలు సందర్భంగా మైనార్టీ సోదరులు ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ సయ్యద్ షావలి దర్గా మహోత్సవాల సందర్భంగా జనవరి, 3,4,తేదీలలో,గంధం, ఉలుసు కార్యక్రమాలు ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం, ముజావరీ,సయ్యద్ సలా ఉద్దీన్ మాట్లాడుతూ హిందూ ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరూ గందోత్సవ, ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అల్లా అనుగ్రహం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట మండలంలో ముగిసిన రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట :మండలంలో శనివారంతో రెవిన్యూ సదస్సులు ముగిశాయి. దర్శిపల్లె నారాయణరాజుపేటలో డిప్యూటీ తాసిల్దార్ అంజనా గౌరి ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు రెవిన్యూ సదస్సులో తెలుగుదేశం పార్టీ రాజంపేట ఇన్చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం రెండురెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు సుమారు నెలరోజుల పాటు జరిగిన రెవెన్యూ సంస్థలు ప్రశాంతంగా ముగిశాయి ఒంటిమిట్టలో శుక్రవారం తెలుగు తమ్ముళ్ల వాగ్వాదం మినహా రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి.

## వచ్చారు..వెళ్లారు ! ఇదీ..మండల సమావేశం తీరు.!!

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి నిర్మాణం పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు వంటి ఎన్నో అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగి తీర్మానాల వైపు అడుగులు వేయాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయని చెప్పడానికి శనివారం ఇక్కడ జరిగిన సమావేశమే చక్కటి తార్కాణం. మండల పరిషత్ ఉపాధ్యక్షులు మల్లు వెంకటమోహన్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశం వచ్చారు.. వెళ్లారు అన్నట్లుగా సాగడం మండల ప్రజల దురదృష్టం కాబోలు. సమావేశంలో అధికారులు తమ శాఖలకు సంబందించిన అంశాలను వివరించడం మినహా సభ్యుల నుంచి పెద్దగా ప్రశ్నలు ఉత్పన్నం కాకపోవడం సమావేశం నామమాత్రంగా కొనసాగిందని చెప్పవచ్చు. చిలమకూరు ఎంపీటీసీ సభ్యులు నవీన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం పనులు పూర్తి అయినప్పటికీ ప్రారంభించకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే ఈ సచివాలయాన్ని ప్రారంభించాలని సూచించారు. ఎంపీడీవో వెంకటరమణయ్య ప్రభుత్వ పథకాలను ప్రజాప్రతినిధులు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. మండల తాహసీల్దార్ శోభన్‌బాబు మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయని కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హౌసింగ్‌ఏఈ రామకృష్ణ ప్రభుత్వ పక్కా గృహాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ రాజారామమోహన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ రంతుల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ వినయ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నా భార్య ఆచూకీ తెలపండి

**విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ :** మండలం, చల్లగిరిగెల్ల గ్రామంలో నివాసం ఉంటున్న పిల్లి కావ్య, భర్త మల్లికార్జున, వయస్సు 29 సం.లు అను ఆమె గత నాలుగు రోజుల క్రితం పోరుమామిళ్ల కు తన ఇంటి నుండి ఆటో లో వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని, పిల్లి మల్లికార్జున తన భార్య గురించి చుట్టూ ప్రక్కల మరియు బంధువుల దగ్గర విచారించి తన భార్య ఆచూకి తెలియరానందున పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ కు వచ్చి పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశారు.

## 30న నిరసనలను విజయవంతం చేయాలి - సిపిఐ

**విశాలాంధ్ర - రైల్వేకోడూరు :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై రాజ్యసభలో అవమానకరమైన అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30 తారీఖున సోమవారం ఉదయం చేపట్టే నిరసనల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ పిలుపునిచ్చారు.శనివారం సిపిఐ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది అణగారిన వర్గాలకే కాకుండా సమస్త సమాజ వినాశనానికి దారితీసే దుర్మార్గమైన అంశమన్నారు.అమిత్ షాను తక్షణం కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.అమిత్ షా రాజ్యాంగ పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. మోడి సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రయివేటు కంపెనీల చేతుల్లో పెట్టి సంపదను అంతా అంబానీకి, అదానికీ దోచిపెడుతన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహయ కార్యదర్శి ఎం.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష మన వారసత్వపు ఆస్తి..:తులసిరెడ్డి

**విశాలాంధ్ర-వేంపల్లి:** తెలుగు భాష మన వారసత్వపు ఆస్తి అని రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి అన్నారు. విజయవాడలో శనివారం కెబిఎన్ కళాశాలలో మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన తులసిరెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష అతి ప్రాచీనమైన భాష అన్నారు. 2500 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థావన కలిగిన భాష అన్నారు. ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాష తెలుగు అన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవ రాయులు కీర్తించిన విషయాన్ని గుర్తుచేశారు.ఆంగ్లేయుడైన సిపి బ్రౌన్ కూడా తెలుగు సూరీడుగా ప్రకాశించారన్నారు. గత కొంత కాలంగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే సమీప భవిష్యత్‌తలో తెలుగు భాష మృతభాష అవుతుందేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ గత ప్రభుత్వం జీవో85 జారీచేయడం చారిత్రక తప్పిదమన్నారు. ఈ జీవోను ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా ఉద్యోగాలలో తెలుగు మృాధ్యమంలో చదివిని వారికి 3 నుంచి 5శాతం అదనపు మార్కులు వేయాలని తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సుప్రీమ్‌కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, మార్గదర్శి ఎండి శైలజా కిరణ్, మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సుజనా చౌదరి, గోరేటి వెంకన్న , యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చైతన్యరాజు, డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, భువన చంద్ర, లక్ష్మణ్‌రెడ్డి, దేశ విదేశాల నుంచి వచ్చిన రచయితలు పాల్గొన్నారు.